క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం

అమలాపురం రూరల్: మండలంలోని కొంకాపల్లిలో ఈ నెల 25న జరిగే దసరా ఉత్సవాలకు రావాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు సుధా గణపతి, కాసరి రామకృష్ణ, రంకిరెడ్డి సత్తిబాబు తదితరులు ఆహ్వానించారు. సోమవారం భట్నవెల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఆడియో ఆల్బమ్ ఆవిష్కరణ



ఆడియో అల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న పారిశ్రామికవేత్త రామకృష్ణ తదితరులు

అమలాపురం టౌన్: సాహితీవేత్త డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి రచించిన «శరణుకోరి వచ్చాము శ్రీవాసవీ మాత, కరుణ చూపి దీవించు వాసవీ మాత» ఆడియో ఆల్బమ్‌ను స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పారిశ్రామికవేత్త పచ్చిగోళ్ల రామకృష్ణ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం గీత రచయిత డాక్టర్ కొల్లూరి, స్వరకర్త దుర్గారావులను పట్టణ వైశ్య సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, కార్యదర్శి నంబూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి తటవర్తి బంగారం, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

20న వైఎస్సార్ సీపీ సమావేశం

అమలాపురం టౌన్: ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు ఇందుపల్లి ఎ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని సోమవారం తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుడికి ఆచార్యదేవోభవ పురస్కారం



ఆచార్యదేవోభవ పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు బాలకృష్ణ

అమలాపురం టౌన్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణకు కాకినాడ చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అందించే ఆచార్య దేవోభవ పురస్కారం లభించింది. కాకినాడ సూర్య కళా మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, సంస్థ అధ్యక్షుడు రవికుమార్, ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయుడు బాలకృష్ణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అమలాపురం ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశ్, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి పురస్కార గ్రహీత బాలకృష్ణను అభినందించారు.

ఘనంగా సంతోషిమాత విగ్రహావిష్కరణ



పశువుల్లంకలో సంతోషిమాతను దర్శించుకున్న భక్తులు

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంకలో సంతోషిమాత విగ్రహావిష్కరణ కార్యక్రమం గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో పూజా కార్యక్రమాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

యానాం: స్థానిక భూసమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కాపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హంస వాహనోత్సవం జరిపారు. ఈ సందర్భంగా స్వామికి సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన చేశారు.

ఆమ్ ఆద్మీ కన్వీనర్‌గా పవన్

అమలాపురం టౌన్: ఆమ్ ఆద్మీ పార్టీ అమలాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా పెయ్యల పవన్ నియమితులయ్యారు. అమలాపురంలోని ఓ హోటల్‌లో జిల్లా కన్వీనర్ నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో పవన్‌కు నియోజకవర్గ కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా కుసుమ కన్నీడిని నియమించారు. సమావేశంలో తోకల వరదరాజు, జి.విజయకుమార్ పాల్గొన్నారు.

కరుణించు జగన్మాతా

- బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి



బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారు రెండో రోజు సోమవారం బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వైష్ణవి కనకదుర్గ ఆలయంలో అమ్మవారు, పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి ఆలయం వద్ద అమ్మవారి సన్నిధిలో సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

రెండో రోజు ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని మండలంలోని పెదగాడవిల్లిలో కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు జరిపి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు.

బాలాత్రిపుర సుందరిగా దుర్గాదేవి

తాళ్లరేవు: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో పూజలందుకున్నారు. ప్రధానంగా తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీవాసవీమాత ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు.



తాళ్లరేవు వాసవీమాతను బాలా త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు



పెదగాడవిల్లిలో కనకదుర్గ అమ్మవారు



కౌమారీదేవి అలంకరణలో లలితాదేవి

బ్రహ్మచారిణి అమ్మవారుగా భక్తులకు దర్శనం

యానాం: పట్టణంలో కొలువైన శారదాదేవి(సరస్వతిదేవి) అమ్మవారు నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం బ్రహ్మచారిణి అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెన్మెత్స రామరాజు దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక లలితాదేవి ఆలయంలో దేవీ దశావతారాల్లో భాగంగా కౌమారీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస కల్యాణం హరికథను వినిపించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. ఉత్సవదారులుగా కాపగంటి సూర్యనారాయణ కుమారులు వ్యవహరించారు.



ముఖ ద్వారంపై విద్యుత్ దీపాలతో రూపుదిద్దుకున్న సెట్టింగ్



అందమైన భవంతిని తలపించేలా వర్ణ రంజితంగా ఉన్న సెట్టింగ్

వర్ణ రంజితం... నయనానందకరం

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద దసరా మహోత్సవాల్లో భాగంగా నిర్మించిన చలువ పందిరి విద్యుత్ దీపాలతో వర్ణ రంజితంగా భక్తులను అలరిస్తుంది. చలువ పందిరికి మూడు ముఖ ద్వారాలపై దేవతామూర్తుల రూపాలను విద్యుత్ దీపాలంకరణలతో రూపొందించారు. ప్రధాన ముఖద్వారం మాత్రం దాదాపు 60 అడుగుల ఎత్తుతో రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయస్వామిలతో కూడిన రామాలయ సెట్టింగ్‌ను విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు. దసరా ఉత్సవాల సందర్భంగా ముఖ్యంగా రాత్రి సమయాల్లో భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి ఈ చలువ పందిరిని ప్రత్యేకంగా వీక్షిస్తున్నారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ పందిరి ఏర్పాటుచేశారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి



అమలాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న మెప్మా మహిళలు, ఐసీడీఎస్ సిబ్బంది

అమలాపురం టౌన్: బాల్య వివాహాల నిర్మూలనలో మహిళలు ముఖ్య భూమిక పోషించాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించమంటూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీని కమిషనర్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి, ఐసీడీఎస్ వర్కర్లు జి.అనసూయ, సీహెచ్ రుక్మిణి, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అల్లవరం మండల మహిళా సమాఖ్య వద్ద ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులు

బాల్య వివాహాలు లేని భారత్ లక్ష్యం

అల్లవరం: బాల్య వివాహాలు లేని భారతదేశం లక్ష్యంగా క్షేత్ర స్థాయి నుంచి అన్ని వర్గాల వారు కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం సయ్యద్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు అంగన్‌వాడీలు, ఏఎంలు, మహిళా పోలీసులతో సమన్వయం పరచుకుని బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహాలతో బాలికల చదువు, ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలను అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, కార్యదర్శులు ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి

అల్లవరం: సచివాలయ భవనాలు, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు తదితర ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి బుడితి రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో కలిసి ఎంపీడీఓ సోమవారం పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల పరిధిలో డిజిటల్ పేమెంట్స్ నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. బాల్య వివాహాలు, జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి సంపన్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, ఎన్‌వీవీ సత్యనారాయణ, రాజమోహన్, చిక్కం శ్రీనివాస్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ కృష్ణమోహన్, అధికారులు

దారి చూపిన దేవతకు ఘన నివాళి



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

యానాం: తమకు చిన్నప్పుడు విద్యా బుద్ధులు నేర్పి సన్మార్గంలో నడిపించిన ఉపాధ్యాయురాలి మరణ వార్త నాటి విద్యార్థుల్ని కలచివేసింది. ఆమెకు నిజమైన నివాళి ఇవ్వాలని నిర్ణయించుకున్న వారంతా ఆమె పేరు మీద సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వివరాల్లోకి వెళితే యానాం విద్యాశాఖలో ఉపాధ్యాయురాలుగా, విద్యాశాఖ డైరెక్టర్‌గా సేవలందించి పదవీ విరమణ చేసిన జయశ్రీ రెండు వారాల క్రితం పుట్టపర్తిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు అక్కడే అంత్యక్రియలు సైతం జరిగాయి. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో చదువుకున్న 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బొడ్డు ప్రసాద్, గిడ్ల సత్యనారాయణ, గుత్తుల లక్ష్మణరావు, కాళ్ల ప్రసాద్, అబ్దుల్లా, జగ్గారావులు ఆమె మరణ వార్త తెలుసుకుని కన్నీరుమున్నీరయ్యారు. చిన్ననాటి నుంచి తమకు ఆమె చెప్పిన నీతికథలు, నైతిక విలువల పాఠాలను గుర్తు చేసుకున్నారు. ఆమె కోసం సంతాప సూచకంగా సభను నిర్వహించడం కంటే ఏదైనా సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అందుకే సోమవారం తమ ఉపాధ్యాయురాలి పేరు మీద స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పాటు దుప్పట్లను సైతం పంపిణీ చేసి తమ ఉపాధ్యాయురాలికి నిజమైన నివాళిని అర్పించారు. ఉపాధ్యాయురాలు జయశ్రీ యానాంను వదిలి చాలా ఏళ్లయినా ఆమెను మరిచిపోకుండా సేవా కార్యక్రమం నిర్వహించడంపై పూర్వ విద్యార్థులను స్థానికులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఉప్పంగల పంచాయతీ తంగేడు పంపు గ్రామానికి చెందిన వెంకన్న రెండేళ్ల క్రితం బైక్‌పై వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో వెంకన్న వెన్నుముక పనిచేయకుండా పోయింది. దీంతో పనికి వెళ్లలేక ఇంటివద్దనే ఉండడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయన రూ.10 వేల నగదును బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు దడాల సువర్ణలత, వెంకటరమణ, కాజా గోవిందు, కాజా శ్రీనివాస్ తదితరులున్నారు.



వెంకన్న కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

స్నేహితుని కుమార్తెకు సహాయం

తాళ్లరేవు: తమతో కలిసి చదువుకున్న స్నేహితుని కుమార్తె అనారోగ్యం బారిన పడడంతో తోటి మిత్రులంతా కలిసి ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక నామన వెంకాయమ్మ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88 సంవత్సరంలో కలిసి చదువుకున్న విద్యార్థులు డైమండ్ గ్రూపుగా ఏర్పడి పలు సేవాకార్యక్రమాలను చేస్తున్నారు. తోటి మిత్రుడు చాట్ల రామకృష్ణ గతంలోనే మృతి చెందాడు. ఇటీవల అతడి కుమార్తె వసంతకు గుండె ఆపరేషన్ చేశారు. ఈ నేపథ్యంలో డైమండ్ గ్రూపు సభ్యులు సోమవారం కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి వెళ్లి వసంతకు ఆర్థిక సాయంగా రూ.1.14 లక్షల నగదును అందజేశారు. అదే పాఠశాలలో 1996–97 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.58 వేలు అందజేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వసంతకు నగదు అందజేస్తున్న డైమండ్ గ్రూపు ప్రతినిధులు

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

తాళ్లరేవు: గ్రామీణ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సోమవారం మండల పరిధిలోని పటవల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిబిరంలో 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఎంపీపీ సునీత చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ, మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు రాయుడు గంగాధర్, కొప్పిశెట్టి వెంకట్, కొటికెలపూడి చందు, కోరుకొండ వీరబాబు పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

జాతీయ క్రీడలకు అంపైర్‌గా శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: గోవాలో జరిగే 43వ జాతీయ క్రీడా పోటీలకు అమలాపురం కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావును బ్యాడ్మింటన్ నేషనల్ అంపైర్‌గా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు గతంలో థామస్ ఉబర్ కప్, ఇండియన్ ఓపెన్, వరల్డ్ స్కూల్ చాంపియన్ షిప్ తదితర జాతీయ స్థాయి టోర్నమెంట్లలో న్యాయ నిర్ణేతగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకమ్మ చౌదరి, కొట్టపల్లి బాల సుబ్రహ్మణ్యం, మెట్ల వెంకటరమణబాబు తదితరులు అభినందించారు.



పాయసం శ్రీనివాసరావు

మంత్రి విశ్వరూప్ పరామర్శ

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మానే కృష్ణను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం పరామర్శించారు. కృష్ణ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన నివాసంలో కలిసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రాంగోపాల్, తుని నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



భీమనపల్లిలో మానే కృష్ణను పరామర్శిస్తున్న మంత్రి

జేసీని కలిసిన కోకో ఫెడ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్‌ను కోనసీమ వినియోగదారుల ఆర్గనైజేషన్ ఫెడరేషన్(కోకో) ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ చట్టం–2019 బుక్‌లెట్‌ను జేసీకి ఇచ్చారు. వినియోగదారుల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేస్తున్న వినియోగదారుల సంఘాల ప్రతినిధులను నోడల్ ఆఫీసర్లుగా వివిధ కమిటీల్లో నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, జనరల్ సెక్రటరీ ఎస్.ఆదిత్యకిరణ్, అరిగెల వెంకట రామారావు, కోకో ఫెడ్ పీఆర్ఓ జీఎస్ రావు, బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోనసీమ వినియోగదారుల ఫెడరేషన్ ప్రతినిధులు

ముగ్గురు యువకులపై కేసు

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీరానికి వచ్చిన పర్యాటకులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై అల్లవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అమలాపురానికి చెందిన అన్నవరపు చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఓడలరేవు బీచ్‌కి వచ్చారు. సాయంత్రం బీచ్ నుంచి తిరిగి అమలాపురం వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఆయన కుటుంబసభ్యులతో మేడిద పవన్, అనురామ్, అక్కల శివ అనే యువకులు అసభ్యకరంగా ప్రవర్తించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన చంద్రశేఖర్‌పై దాడి చేసి గాయపరిచారు. చంద్రశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

మంత్రి విశ్వరూప్‌కు సత్కారం



మంత్రి విశ్వరూప్‌ను సత్కరించిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి ఆలయాన్ని సోమవారం మధ్యాహ్నం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు మంత్రి విశ్వరూప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావులను అమ్మవారి సన్నిధిలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మళ్ల సురేష్, కుప్పాల రామకృష్ణ, మెహబూబ్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి దంపతులు



భట్నవిల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి విశ్వరూప్ దంపతులు

అమలాపురం రూరల్: మండలంలోని భట్నవిల్లిలో విజయదుర్గ అమ్మవారిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. శరన్నవరాత్ర మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి విశ్వరూప్ దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

స్వామీజీకి సత్కారం



స్వామీజీ దంపతులను సత్కరిస్తున్న చల్లపల్లి గ్రామస్తులు

ఉప్పలగుప్తం: ఇటీవలే విశాఖపట్టణం ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన చల్లపల్లి గ్రామానికి చెందిన కొల్లు స్వామీజీని గ్రామస్తులు సత్కరించారు. సోమవారం గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్వామీజీ దంపతులిద్దరినీ దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, డీఎంఆర్ శేఖర్, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు, బూసి బుజ్జిదొర తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ అటెండెంట్ ఫలితాల విడుదల

యానాం: డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలో థియేటర్ అటెండెంట్ పోస్టు కోసం ఈ నెల 15న జరిగిన పరీక్షా ఫలితాలను ఒక రోజు వ్యవధిలోనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి ఎల్.కుమార్ సోమవారం విడుదల చేశారు. యానాంకు చెందిన సంగాని శేషగిరిరావు, పెసింగి చిట్టిబాబు, బొమ్మిడి వెంకటేష్, పెయ్యల నరసింహమూర్తి, మల్లాడి శ్రీహరి, ఎం.సుదర్శన్, మల్లాడి నీలాద్రి, శేరు దీపక్‌కుమార్, దొమ్మేటి రాజరవీంద్రకుమార్, అడపా సంపత్‌కుమార్‌లు ఎంపికయ్యారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

ఐ.పోలవరం: రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ డి.రాంబాబు అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన చైతన్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు చదువుకుంటే మెరుగైన సమాజం స్థాపించవచ్చన్నారు. మహిళా సంఘాలతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మద్యం అమ్మకందారుల అరెస్ట్

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలోని పెట్రోలు బంక్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అక్రమ మద్యం అమ్ముతున్న అమలాపురం నల్లవీధికి చెందిన ముదపాక కనక నాగ చంద్రశేఖర్, రామకృష్ణనగర్‌కు చెందిన కాకిలేటి దుర్గా సత్యప్రసాద్‌లను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితులను అమలాపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించారన్నారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.